# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# తెలంగాణ రాష్ట్ర కమిటీ

## పత్రిక ప్రకటన

## నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా మార్చి 26న భారత్ బంద్‌ను జయప్రదం చేయండి!

## సామ్రాజ్యవాదుల ప్రాయోజిత ఆదేశాలతో మోడీ ప్రభుత్వం ముందుకు తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేసే వరకు రైతాంగం పోరాటాన్ని కొనసాగించాలి!

## దేశంలోని యావత్తు ప్రజలు పోరాడే రైతాంగానికి మద్దతునివ్వాలి!

నేడు దేశంలో రైతాంగం మహోజ్వాల పోరాట ఘట్టానికి తెర తీసింది. వలసవాద వ్యతిరేక పోరాటంలో రైతాంగం ప్రముఖ పాత్ర వహించింది. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా దేశమంతటా అనేక తిరుగుబాట్లు చేసింది. రాచరిక, ఫ్యూడల్, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్లో చారిత్రక పాత్ర వహించింది. పంజాబ్ నుండి బెంగాల్ వరకు, మధ్యప్రదేశ్ నుండి దక్షిణాన తమిళనాడు వరకు జరిగిన బ్రిటీష్ వ్యతిరేక పోరాటాల్లో రైతాంగానిదే చారిత్రకంగా ప్రధానమైన పాత్ర ఉండింది. అలాంటి పోరాట వారసత్వం గల రైతాంగం నేడు బిజెపి ప్రభుత్వం తెచ్చిన ప్రతిఘాతుక మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా మిలిటెంట్‌గా పోరాడుతున్నది. భూమి, స్వపరిపాలన కోసం బ్రిటీష్ వలసవాదులకు వ్యతిరేకంగా పోరాడిన రైతాంగం, నేడు నయావలసవాద, సామ్రాజ్యవాద అనుకూల, దళారీ నిరంకుశ బడాబూర్జువా ప్రయోజనాలు నెరవేర్చడానికి బిజెపి ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఈ మూడు చట్టాల ద్వార ప్రభుత్వం తమ భూములను లాక్కోంటుందని గ్రహించిన రైతాంగం ఎంతో పట్టుదలతో పోరాటానికి దిగింది. వంద రోజులకు పైగా సాగుతున్న రైతాంగ పోరాటాలు తమకు ఎదురులేదని భావిస్తున్న బిజెపి ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. సామ్రాజ్యవాదులకు, దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికి కలవరం రేపుతున్నది.

ఈ చట్టాల ద్వారా కార్పొరేట్ కంపెనీలకు, బహుళజాతి కంపెనీలకు దేశంలో వ్యవసాయ రంగంపై గట్టి పట్టు ఏర్పడుతుంది. రైతాంగం చేతులలో ఉన్న భూములకు సంబంధించిన పెట్టుబడి నిర్ణయాలు తీసుకోగలిగే విధంగా అంతర్జాతీయ, దేశీయ కార్పొరేట్ కంపెనీలకు అధికారం దక్కుతుంది. దేశంలో ఉన్న పేద, మధ్య తరగతి రైతులు తమ భూములు కోల్పోయి కూలీలుగా మారే ప్రక్రియ వేగవంతం అవుతుంది. చిన్న, మధ్య రకం కమతాలు లాభాసాటిగా లేకుండ పోయి, రైతాంగం దివాళ తీసి తమ భూములను అమ్ముకోవాల్సిన దుస్థితికి దారి తీస్తుంది. ఇప్పటికీ మూడు లక్షలకు పైగా నమోదైన ఆత్మహత్యల పరంపర మరింత తీవ్రతరం అవుతుంది. ప్రపంచ వ్యవస్థీకృత రిటైల్ రంగం వర్తక గొలుసులో ఇరుక్కొని చిన్న రైతులు తమ భూముల నుండి స్థాన భ్రంశం చెందుతారు. చిల్లర వర్తకం కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్తుంది. తద్వార దేశంలోని మార్కెట్లు (మండీలు) మూసివేయబడతాయి. రైతన్న పంటను నచ్చిన రీతిలో అమ్ముకునే పరిస్థితిని కోల్పోతాడు. అంతేగాకుండా రైతుకు లభించే మద్దతు ధరను ప్రభుత్వం రద్దు చేస్తుంది. వ్యవసాయంలో కాంట్రాక్టు పద్ధతి బలోపేతం అయి భూమి, ఉత్పత్తి మీద రైతులు తమ హక్కులను కోల్పోతారు. ఇలా రైతాంగం సంప్రదాయక భూమి హక్కులను, ఆవాసాలను కోల్పోవడమే గాకుండా వ్యవసాయ ఆర్థిక స్థితిపై ఆధారపడిన సామాజిక సంబంధాలను కూడ కోల్పోయి దిక్కు తోచని స్థితికి నెట్టబడుతుంది. దీనితో రైతాంగం పరిస్థితి పెనం మీది నుండి పొయ్యిలో పడబోతున్నదనే ఆందోళనతోనే ఆగ్రహానికి గురైంది.

గడ్డ కట్టుకపోయే చలిలో లక్షలాది మంది రైతాంగం ఆరుబయల్లో ఆందోళన చేయడం చరిత్రలో ఒక గొప్ప సన్నివేశం. వీరికి అక్కడ స్థానిక ప్రజల మద్దతు ఎంతగానో లభించింది. ఇందులో చుట్టూ ప్రక్కల వ్యాపారస్తులతో పాటు మైనార్టీలు కూడ భోజనాలు సరఫరా చేయడమే గాక ఉద్యమానికి మద్దతు తెలిపారు. మైనార్టీలు కూడ రైతాంగంలో భాగమే కావున వారు కూడ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొంటున్నారు.

నరేంద్ర మోడీ ప్రభుత్వం రెండవ సారి అధికారానికి వచ్చిన తర్వాత హిందు రాష్ట్రం ఏర్పాటుకు, సామ్రాజ్యవాదుల, దళారీ

నిరంకుశ బూర్జువా ప్రాయోజిత కార్యక్రమాలను దూకుడుగా అమలు చేస్తున్నాడు. కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని హరించడం, రామ మందిర నిర్మాణం, పౌరసత్వ సవరణ చట్టం, కార్మిక హక్కుల హననం, పత్రిక స్వేచ్ఛకు తూట్లు పొడవడం, ఉపా చట్టంలో సవరణలు, పార్లమెంటరీ చట్టాల్లో పలు మార్పులు, జిఎస్‌టి అమలు, డిమానిటైజేషన్ లాంటి అనేక నిర్ణయాలు తీసికొని దేశ ప్రజలకు ద్రోహం చేస్తూ ఇప్పుడు వ్యవసాయ చట్టాలను ముందు తెచ్చి భారత రైతాంగానికి తీవ్రమైన నష్టాన్నీ కలుగజేస్తున్నాడు. అదే సమయంలో పబ్లిక్ సెక్టార్‌లోని అనేక ముఖ్యమైన పరిశ్రమలల్లో వంద శాతం పెట్టుబడిని ఆహ్వానించి, సామ్రాజ్యవాదులకు ఎర్ర తివాచీ పరుస్తున్నాడు. ఈ ప్రతిఘాతుక, ప్రజావ్యతిరేక, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా అన్ని రంగాల ప్రజలు మిలిటెంట్‌గా ఉద్యమాలు చేస్తున్నారు. మిలిటెంట్ ప్రజా ఉద్యమాలను లెక్క చేయకుండా, ఈ ఫాసిస్టు చట్టాల అమలుకు పూనుకొంటూనే ఉన్నాడు. వ్యవసాయ చట్టాలను ఎట్టి పరిస్థితిల్లో వెనక్కి తీసికోనే ప్రసక్తే లేదని రైతాంగాన్ని బెదిరిస్తున్నాడు. ప్రతిపక్షాలనిరసనల మధ్యనే పార్లమెంటులో బిల్లులను గెలిపించుకున్నాడు.

బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలు, నిర్ణయాలు, నిర్భంధాలకు బలి అవుతున్న రైతాంగం, కార్మికులు, విద్యార్థులు, మహిళలు, జాతులు, మైనారిటీలు, మేధావులు, పాత్రికేయులు, ప్రజాస్వామిక వాదులు ఒక్కటై మిలిటెంట్‌గా పోరాడి మోడీ ప్రభుత్వానికి, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి ఘోరి కట్టాలి. నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం చేయడం ద్వారానే భారత ప్రజలు అన్ని రకాల దోపిడి నుండి విముక్తి అవుతారు.

**విప్లవాభినందనాలతో,**

**జగన్,**

**అధికార ప్రతినిధి,**

**తెలంగాణ రాష్ట్ర కమిటీ,**

**సీపీఐ (మావోయిస్టు).**